క్లుప్తంగా

ఆలయానికి రూ.50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక డీసీసీబీ కాలనీలో వేంచేసిన భూ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి భవానీ నగర్‌లో ఉంటున్న ఆర్మీ అధికారి పప్పల జగన్నాథం, పార్వతి దంపతుల కుమారుడు శ్రీనివాస్ రూ.50,116ల విరాళం సోమవారం అందించారు.

బాలికలకు అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గుడ్ టచ్ – బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. స్థానిక వికాస్ హైస్కూల్‌లో న్యాయ అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలతో ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, మాట్లాడినా, చేతులు వేసినా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. అవగాహనతోనే నేరాలు అదుపులో పెట్టవచ్చని సూచించారు. బాల్య వివాహాలు వలన శారీరక, ఆరోగ్యపరమైన సమస్యలు ఉంటాయని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలు తెలుసుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా జి.ఇందిరా ప్రసాద్, కె.వేణుగోపాలరావు, కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత కోసమే సామాజిక తనిఖీలు

గార: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత పెరిగేందుకే సామాజిక తనిఖీ చేపడుతున్నారని రామచంద్రాపురం సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి అన్నారు. సోమవారం 2024– 25లో జరిగిన పనులను సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామసభల ఆమోదం మేరకే ఉపాధి హామీ పనులు నిర్ణయిస్తున్నామని, ప్రజల అవసరాల మేరకే నిర్ణయం తీసుకుంటామన్నారు. మస్తర్లలో సంతకాలు లేకపోవడం వంటివి గుర్తించారని, అటువంటివి జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రుప్ప శ్రీనివాసరావు, అంబటి చక్రధరరావు, అంబటి చినబాబు, కుంచాల సురేష్, డీఆర్‌పీ ఎస్.అప్పలనాయుడు, పంచాయతీ సెక్రటరీ ఎం.రాము తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని కొవ్వాడ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మైలపల్లి గురువులు తల్లి రాజులమ్మ, అలాగే అదే గ్రామానికి చెందిన మైలపల్లి పోతయ్య, మైలపల్లి అసిరోడు, మైలపల్లి జనపమ్మలు ఇటీవల మరణించారు. దీంతో వాళ్ల కుటుంబాలను ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సోమవారం పరామర్శించారు. ఆయనతో పాటు సర్పంచ్ అల్లిపల్లి అప్పన్న, నాయకులు మైలపల్లి నాగేంద్ర ప్రసాద్, మైలపల్లి పట్టయ్య, మైలపల్లి అప్పన్న, బడి రాము, మైలపల్లి సత్యం తదితరులు ఉన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో పతకాల పంట

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్–2025 క్రీడా పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన వెటరన్ స్విమ్మర్లు పతకాల పంట పండించారు. ఈనెల 11, 12 తేదీల్లో మంగళగిరిలో జరిగిన 7వ జాతీయ మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీల్లో జిల్లా స్విమ్మర్లు షేక్ సుభాన్, కిషోర్, పి.సత్తిబాబు, సీహెచ్ వెంకట్‌లు వివిధ ఈవెంట్స్‌లో మొత్తం 15 పతకాలు సాధించి శభాష్ అనిపించారు. వీరంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరుపున జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించారు. పతకాలు సాధించిన వీరిని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు బుక్కూరు ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుప్పల వెంకటరావు, జిల్లా కార్యదర్శి నౌపడ రాజారావు తదితరులు అభినందించారు.

పట్టుబడిన పేకాటరాయుళ్లు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని మొండేటి వీధి సమీపంలో పేకాట ఆడుతూ ఆరుగురు వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి పట్టుబడ్డారు. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరానికి చెందిన గుడియా శర్వాజీ, గుడియా శ్రీధర్, పాట్నూరు సూర్యనారాయణ, వారణాసి సాయికుమార్, కోరాడ నాగరాజు, అంధవరపు రవికుమార్‌లు పేకాట ఆడుతుండగా ఎస్ఐ హరికృష్ణ సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.20,275లు నగదు స్వాధీనం చేసుకున్నారు.

రణస్థలం: ఎక్సైజ్ కార్యాలయానికి ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కల్తీ మద్యంపై కన్నెర్ర

- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్ తదితరులు

రణస్థలం: కూటమి పాలనలో రాష్ట్రంలో జరుగుతున్న కల్తీ మద్యంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు కన్నెర్ర చేశారు. దీనిలో భాగంగా నకిలీ మద్యాన్ని అరికట్టి, ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతూ రణస్థలం మండల కేంద్రంలోని రామతీర్థాలు కూడలి నుంచి రణస్థలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం భారీ ర్యాలీ సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బయటపడిన నకిలీ మద్యం తయారీపై సీబీఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. చిత్తూరు, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు నెల్లూరు, విజయవాడ, ఏలూరు, పాలకొల్లు, పరవాడ తదితర ప్రాంతాల్లో సైతం నకిలీ మద్యం పట్టుబడిందని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దాదాపు 421 మంది నకిలీ, కల్తీ మద్యం వల్ల మరణించినట్లు తెలుస్తోందన్నారు. కల్తీ మద్యం వలన చనిపోయిన వారిని గుర్తించి కుటుంబాలను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే పెరిగిన వైన్ షాపులు, లిక్కర్ విక్రయ వేళలు, బెల్టు షాపుల వలన మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. కల్తీ మద్యం – కల్తీ రాజ్యం అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం రణస్థలం ఎక్సైజ్ సీఐ అనురాధ దేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసులతో మాట్లాడుతున్న రామ్‌మనోహర్‌నాయుడు



కుటీర పరిశ్రమల్లా కల్తీ మద్యం కేంద్రాలు



పోలీసులతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల వాగ్వాదం

శ్రీకాకుళం క్రైమ్: రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం కేంద్రాలు కుటీర పరిశ్రమల్లా వెలుస్తున్నాయని, తద్వారా పేద ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని వైఎస్సార్సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు ధ్వజమెత్తారు. కల్తీ మద్యాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని న్యూకాలనీలో ఉన్న ఎక్సైజ్ స్టేషన్‌కు ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా నినాదాలు చేసుకుంటూ వెళ్లి సీఐ ఎంవీ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామ్‌మనోహర్ నాయుడు మాట్లాడుతూ.. మద్యం కల్తీపై సిట్‌తో కాకుండా సీబీఐతో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ మద్యం గుట్టురట్టు చేయాలని, దీని వెనక ఎంత పెద్దవారున్నా అరెస్టు చేయాలని, చనిపోయినవారి కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వైన్‌షాపుల కేటాయింపులో అవకతవకలను గుర్తించి లైసెన్సులు రద్దు చేసి మద్యం షాపులు ప్రభుత్వమే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విక్రయించే వేళలు తగ్గించాలని, బడులు, గుడులు, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన దుకాణాలు, బార్లను తక్షణమే రద్దు చేయాలన్నారు. అంతకుముందు నాయకులతో పాటు యువనేత సూర్యమహల్ కూడలికి చేరుకొని ఎక్సైజ్ స్టేషన్‌కు వెళ్లేందుకు ఉపక్రమించగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వెలమ కుల బీసీ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ చల్లా శ్రీను, స్టేట్ జాయింట్ సెక్రటరీ ఎన్ని ధనుంజయరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముంజేటి కృష్ణ, టౌన్ అధ్యక్షుడు సాధు వైకుంఠం, వైవీ శ్రీధర్, మండవిల్లి రవి, బరాటం నాగేశ్వరరావు, మూకాళ్ల తాతబాబు, సుగుణ, పొన్నాన మాధవరావు, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు రౌతు శంకరరావు, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎంఏ బేగ్, మహ్మద్ రఫీ, భైరి మురళి, ఉటపల్లి కృష్ణ, తంగుడు నాగేశ్వరరావు, టి.కామేశ్వరి, ఎండ రమేష్, మేడిపల్లి భరద్వాజ్, అప్పుయాదవ్, కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో చంద్రబాబు విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్ర

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం చంద్రబాబు విఫలమయ్యారని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర అన్నారు. నగరంలోని రామలక్ష్మణ కూడలిలో ఏఐవైఎఫ్ శ్రీకాకుళం జిల్లా ముఖ్య నాయకులతో సమావేశాన్ని బొత్స సంతోష్ కుమార్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్ర మాట్లాడుతూ.. సూపర్ సిక్స్‌లో నిరుద్యోగ భృతి లేదా అని ప్రశ్నించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన ధ్యేయమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, నిరుద్యోగ యువతను నమ్మించి మోసం చేసిందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ చర్యలు జరుగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందో, సంవత్సరన్నర కాలంలో కూటమి ప్రభుత్వం వల్ల రాష్ట్ర ప్రజలకు, యువతకు ఏమి లబ్ధి చేకూరిందో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, మంత్రి నారా లోకేష్ నిరుద్యోగ యువతకు అరచేతిలో వైకుంఠం చూపుతున్నారన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. ప్రజలంతా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నవంబర్ చివరి నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి సత్యసాయి జిల్లా హిందూపురం వరకు నిరుద్యోగి ఆవేదన యాత్ర నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గండాల సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండాలి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: విపత్తుల సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. విపత్తు తగ్గింపు దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ విపత్తుల వల్ల కలిగే నష్టాలను తగ్గించడానికి అవగాహన పెంచుకోవడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజర్ జీవీ రమణ, ఎన్ఎస్ఎస్ పీవో శ్రీనివాస్‌పాత్రో, సీహెచ్ రామ్‌మోహన్, పెంకి చైతన్యకుమార్, యువ భారత్ వాలంటీర్స్ మౌనిక, మధు తదితరులు పాల్గొన్నారు. అలాగే విపత్తులు, అత్యవసర సమయంలో సీపీఆర్, ప్రథమ చికిత్సపై విద్యార్థులు, యువత కనీస అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాకినాడ శ్రీఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్వీ వేణుగోపాల్ పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో విపత్తు తగ్గింపు దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, పీఆర్‌వో చైతన్య, ఎన్ఎస్ఎస్ పీవో ఎల్.మోహనరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా రీసర్వే నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత

జి.సిగడాం: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీసర్వేను పక్కాగా నిర్వహించాలని, విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ మహాదేవు సరిత హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో రైతులకు నెలకొన్న భూ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. రైతుల నుంచి సకాలంలో నీటితీరువా వసూలు చేయాలని, లేని పక్షంలో సంబంధిత వీఆర్‌వోలపై చర్యలు తప్పవన్నారు. రైతులు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను రెన్యూవల్ చేసేందుకు ఎవరూ ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టామన్నారు. వన్‌-బీ రాకపోతే తక్షణమే ఆ గ్రామ వీఆర్వో నేరుగా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ డీటీ కొత్తపల్లి గాయత్రి, మండల సర్వేయర్ శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

14న ఆలయ హుండీల లెక్కింపు

శ్రీకాకుళం కల్చరల్: బలరామ ప్రతిష్ట క్షేత్రంగా పేరుపొందిన ఉమారుద్ర కోటేశ్వర స్వామి దేవాలయం హుండీల లెక్కింపు ఈనెల 14న ఉదయం 10 గంటలకు చేపట్టనున్నట్లు ఆలయ ఈవో సుకన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుండీలను దేవదాయశాఖ అధికారులు, ట్రస్టు సభ్యులు, ప్రజల సమక్షంలో తెరచి లెక్కించనున్నట్లు తెలిపారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

- డీఎస్పీ వివేకానంద



మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వ్యసనాలకు బానిసై బంగారు భవితను నాశనం చేసుకోవద్దని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద సూచించారు. అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపు మేరకు నగరంలోని సన్ ప్రైవేటు డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో 'హలో యువత మేలుకో.. మత్తు పదార్థాల నుంచి నిన్ను నువ్వు కాపాడుకో' నినాదంతో సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తించి సోషల్ మీడియాకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.యుగంధర్, పి.రాజేంద్రబాబు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యలపైనే కాకుండా మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా సదస్సులు జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తామని, అసాంఘిక కార్యక్రమాలు, మత్తు పదార్థాల క్రయ విక్రయాల సమాచారం పోలీసులకు తెలపాలని కోరారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ జయరాం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సంతోష్‌కుమార్, కె.శ్రీనివాసరావు, నగర కన్వీనర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ అమలులో లోపాలను సరిచేయాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరాములు

శ్రీకాకుళం న్యూకాలనీ: జీఎస్టీ అమలులో తలెత్తుతున్న లోపాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సరిచేయాలని, జాప్యం జరిగితే ప్రజలు మరింతగా నష్టపోతారని విశ్రాంత కామర్స్ లెక్చరర్ హనుమంతు లక్ష్మీపతి పేర్కొన్నారు. కళాశాల వాణిజ్య శాస్త్రం, అర్థశాస్త్ర విభాగాలు, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ – సూపర్ పొదుపు 2.0పై అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతి మాట్లాడుతూ జీఎస్టీ అమలులో ఇప్పటివరకు నాలుగు స్లాబులుగా ఉన్న స్థానంలో రెండు స్లాబులు మాత్రమే అమలు చేస్తున్నారని చెప్పారు. కళాశాల అర్థశాస్త్ర విభాగాధిపతి సీహెచ్ రామ్మూర్తి మాట్లాడుతూ జీవిత బీమా, ఆరోగ్య బీమాపై జీఎస్టీ తొలగింపు, 375 రకాల ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గించడం వల్ల ప్రభుత్వంపై సంవత్సరానికి రూ.48,000 కోట్ల భారం పడుతుందని తెలియజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ జీఎస్టీపై విద్యార్థులకు వివరించారు. మేర భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ ప్రజల్లో జీఎస్టీపై మరింతగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పి.జగన్మోహనరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎంవీ సత్యనారాయణ, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్, ఎన్.ఎస్.ఎస్ పీవో డాక్టర్ శ్రీనివాస్ పాత్రో, అధ్యాపకులు ఎస్.పావని, కె.వాసుదేవరావు, కె.చిన్నారావు, వి.రజిని, టి.అరుణకుమారి, టి.దీపిక, బాలు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0పై అవగాహన కల్పించాలి

గార: జీఎస్టీ 2.0పై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి, వెటర్నరీ ఏడీ డాక్టర్ పి.ఎస్.జి.బాలకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గింపు వలన కలిగే లాభాలు, ఏయే రంగాలపై ఎంతమేర తగ్గిందన్న అంశాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. ఎలక్ట్రికల్స్, వాహనాలపై తగ్గింపు మాదిరిగా మెడికల్, నిత్యావసర సరుకుల్లో జీఎస్టీ తగ్గింపు జరగడం లేదని పలువురు సెక్రటరీలు తెలియజేయగా, ప్రజలు కూడా బిల్లు తీసుకోవడం వలన వ్యాపారస్తులు అమలు చేస్తారని ఎంపీడీవో ఈ.రఘు సూచించారు. అనంతరం కళింగపట్నం కళాశాల లెక్చరర్లు ఎస్‌వీవీ సత్యనారాయణ, పి.అప్పలనాయుడు శిక్షణ ఇచ్చారు.

జి.సిగడాం: కేంద్ర ప్రభుత్వం ఇటీవల వివిధ రకాల వస్తువులపై తగ్గించిన జీఎస్టీపై ప్రజలంతా అవగాహన చేసుకుని సామాగ్రి కొనుగోలు చేసుకోవాలని ఎంపీడీవో గుంట ముక్కల రామకృష్ణారావు సూచించారు. మండల కేంద్రంలో సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ముద్దాడ గౌరీ, బోగాది అప్పలనాయుడు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు చిర్రా లక్ష్మి, ఎంఈవో అరసాడ రవి, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, ఏపీవో చోళ్ల సత్యనారాయణ, కుమరాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థినుల అవగాహన ర్యాలీ

శ్రీకాకుళం న్యూకాలనీ: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై ప్రజలు అవగాహన పెంచుకొని, వాటి ఫలాలను అందుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు సూచించారు. కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ 2.0 కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కామర్స్ హెచ్‌వోడీ లబ్బ కృష్ణారావు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చిన్నారావు, అకాడమిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ మౌనిక, ఎకనామిక్స్ లెక్చరర్ డాక్టర్ ప్రభాకర్, ఫిజిక్స్ హెచ్‌వోడీ మూర్తి, రామకృష్ణ, సీవోఈ డాక్టర్ ఆదిలక్ష్మి, కామర్స్ లెక్చరర్లు లలితాబాయి, సంతోషి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సులేవీ..?



చిలకపాలేంలో బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

- ఆర్టీసీ బస్సుల కోసం గంటల కొద్ది నిరీక్షణ
- రద్దీకి తగ్గట్లు కానరాని బస్సులు
- సకాలంలో గమ్యాలకు చేరలేక అవస్థలు
- విద్యార్థులు, ఉద్యోగుల ఆవేదన

ఎచ్చెర్ల: కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు పథకం తీసుకు రావడంతో ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రద్దీ పెరిగింది. అయితే పథకం అమలు చేస్తున్న ప్రభుత్వం రద్దీకి తగ్గట్టుగా బస్సులు పెంపుదల చేయలేదని పలువురు మండిపడుతున్నారు. రద్దీ వలన వృద్ధులు, చిన్నారులు నిల్చొని ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వాపోతున్నారు. బస్సులు రద్దీగా ఉన్నాయనే కారణంతో ఎచ్చెర్ల మండలంలోని అల్లినగరం, ఎచ్చెర్ల, పోలీసు క్వార్టర్స్, అరిణాంఅక్కివలస తదితర ప్రాంతాల్లో బస్సులు నిలపకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు సకాలంలో చేరకోలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. దీంతో తర్వాత వచ్చే బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సుల ఫుట్‌బోర్డులపై వేలాడుతూ విద్యార్థులు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. పలుమార్లు బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు విసుగు చెంది అధిక ధరలను చెల్లించి ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

సకాలంలో చేరుకోలేకపోతున్నారు

రద్దీ పేరుతో బస్సులు అన్ని స్టాపుల్లో ఆపకపోవడం వలన సకాలంలో విద్యార్థులు కళాశాలలకు చేరుకోలేక అవస్థలు పడుతున్నారు. సాధారణ ప్రయాణికులు సైతం గమ్య స్థానాలకు చేరుకోవడానికి ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో అన్ని బస్సుస్టాపుల్లో బస్సులు నిలిపేవారు. కానీ ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు.

– జి.సురేష్‌కుమార్, మురపాక, లావేరు మండలం

అదనపు బస్సులు నడపాలి

ఉచిత బస్సు పథకం వలన బస్సులు రద్దీ అవుతున్నాయి. దీంతో ప్రయాణాలకు నరక యాతన పడాల్సిన పరిస్థితి వస్తోంది. గంటల తరబడి బస్సు వస్తోందని ఎదురుచూస్తే వచ్చే సరికి ఫుల్ అయిపోతున్నాయి. దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రద్దీకు తగ్గట్టుగా అదనపు బస్సులు నడపాల్సిన అవసరముంది.

– బొట్ట దాలినాయుడు, గొల్లపేట, ఎచ్చెర్ల మండలం

బాలికల రక్షణకు ప్రాధాన్యమివ్వాలి



జి.సిగడాం: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రణస్థలం: బాలికల రక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని పంచాయతీ కార్యదర్శి బి.రాజేశ్వరి, హెచ్ఎం జయదేవి సూచించారు. మండలంలోని తెప్పలవలస గ్రామంలో ఈనెల 11న అంతర్జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని బాలికలకు ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలిపొందిన బాలికలకు సోమవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే సుగ్గు కామేశ్వరి, పీఈటీ దాలినాయుడు, అంగన్‌వాడీ కార్యకర్త సుగుణ, ఆశ కార్యకర్త లీలావతి తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని ఎచ్చెర్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి, కేజీబీవీ ప్రత్యేకాధికారి ఇల్లా ప్రమీల ఆకాంక్షించారు. స్థానిక కేజీబీవీలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సత్యంనాయుడు, హెచ్‌వీ కృష్ణవేణి, సూపర్‌వైజర్ భాస్కరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు మహాదాస్యం రాధిక, సువ్వాడ రమాదేవి, శిల్లా భారతి తదితరులు పాల్గొన్నారు.